VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ జనవరి 10 శుక్రవారం 2025
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 176
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

**తెలంగాణలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పెండింగ్‌లో ఉన్న బకాయిలను పూర్తిగా చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇకపై నెలనెలా చెల్లించాలన్నారు.**

**గ్రామస్థాయి ఉద్యోగులకు నెలనెలా జీతాలు సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు**

హైదరాబాద్: తెలంగాణలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పెండింగ్‌లో ఉన్న బకాయిలను పూర్తిగా చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇకపై నెలనెలా చెల్లించాలన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెండింగు బిల్లులపై చర్చించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి దాదాపు 1.26 లక్షల ఉపాధి పనులు జరిగాయని.. వీటికి సంబంధించిన మొత్తం బిల్లులను చెల్లించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో 92,351 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరికి ప్రతినెలా రూ.116 కోట్ల జీతాలు చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇకపై వేతనాలు ఏమాత్రం ఆలస్యం కాకుండా స్పష్టమైన విధానం అనుసరించాలని, ప్రతినెలా ఒకటో తేదీన గ్రీన్ ఛానల్‌లో వీరికి జీతాలు చెల్లించాలని సీఎం చెప్పారు. కేంద్రం నుంచి పంచాయతీలకు విడుదలయ్యే నిధులు ఎప్పటికప్పుడు గ్రామాల అభివృద్ధికి కేటాయించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకాల ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రాబట్టుకోవాలని రేవంత్ అధికారులకు సూచించారు. స్థానిక ఎన్నికలపైనా చర్చ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహ ణ పైనా ముఖ్యమంత్రి రేవంత్ చర్చించినట్లు తెలిసింది. ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానియా, డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ బూసాని వెంకటేశ్వరరావుల ద్వారా కులగణన సమాచారంపై ఆరా తీసినట్లు సమాచారం. పంచాయతీరాజ్ సంచాలకురాలు సృజనతో ఎన్నికల సన్నద్ధత గురించి మాట్లాడారు.



# నిధుల బదిలీ ఆదేశాలు నావే

**ఫార్ములా-ఈ రేసు నిర్వహణ కోసం తన ఆదేశాల ప్రకారమే నిధులు మంజూరు చేశారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మాజీ మంత్రి కేటీఆర్ అవినీతి నిరోధక శాఖ (అనిశా) అధికారులకు తెలిపారు. మంత్రి హెూదాలో తన విచక్షణాధికారం ప్రకారమే నడుచుకున్నానని, సమయాభావం వల్ల అనుమతుల గురించి ఆలోచించలేదని చెప్పారు.**

హైదరాబాద్: ఫార్ములా-ఈ రేసు నిర్వహణ కోసం తన ఆదేశాల ప్రకారమే నిధులు మంజూరు చేశారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మాజీ మంత్రి కేటీఆర్ అవినీతి నిరోధక శాఖ (అనిశా) అధికారులకు తెలిపారు. మంత్రి హెూదాలో తన విచక్షణాధికారం ప్రకారమే నడుచుకున్నానని, సమయాభావం వల్ల అనుమతుల గురించి ఆలోచించలేదని చెప్పారు. ఫార్ములా-ఈ కేసు విచారణలో భాగంగా కేటీఆర్ గురువారం అనిశా ఎదుట హాజరయ్యారు. వివిధ అంశాల గురించి అధికారులు ఆయన్ను ప్రశ్నించారు. రేసు నిర్వహణకు సంబంధించి నిధుల బదిలీలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన ఏసీబీ.. నిందితులను విచారిస్తున్న సంగతి తెలిసిందే. ఏ-1గా ఉన్న కేటీఆర్ వాస్తవానికి సోమవారమే విచారణకు హాజరుకావాల్సి ఉంది. వెంట తన న్యాయవాదులను అనుమతించలేదన్న కారణంగా ఆయన అర్ధాంతరంగా వెనుతిరిగారు. దాంతో అదే రోజు అనిశా అధికారులు ఆయనకు మరోమారు నోటీసులు ఇచ్చారు. ఆ ప్రకారం గురువారం ఆయన ఏసీబీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని అనిశా ప్రధాన కార్యాలయం చుట్టుపక్కల కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రధాన రహదారి నుంచి కార్యాలయంలోకి వెళ్లే దారి వద్ద బ్యారికేడ్లు పెట్టి కేటీఆర్ వాహనాన్ని మాత్రమే అనుమతించారు. రాకపోకలపై ఆంక్షలు పెట్టారు. పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. పది గంటలకు సరాసరి తన న్యాయవాదితో కలిసి అనిశా కార్యాలయంలోకి వెళ్లిన కేటీఆర్‌ను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ ఆధ్వర్యంలోని బృందం ప్రశ్నించింది. విచారణ అంతా ప్రధానంగా అనుమతులు లేకుండా నిధుల చెల్లింపుపైనే...

మంత్రి మండలి అనుమతి లేకుండా పన్నులతో కలిపి సుమారు రూ.55 కోట్లు ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈవో)కు చెల్లించారని, విదేశీ సంస్థకు నిధులు చెల్లించేటప్పుడు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) అనుమతి కూడా తీసుకోలేదనేవి ఈ కేసులో అభియోగాలు. విచారణ అంతా ప్రధానంగా అనుమతులు లేకుండా ఎఫ్‌ఈవోకు నిధుల చెల్లింపుపైనే జరిగినట్లు

తెలుస్తోంది. అంతర్జాతీయంగా రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు వస్తాయన్న ఉద్దేశంతోనే రేసు నిర్వహణ తలపెట్టామని,

తొలి రేసుకు స్పాన్సర్‌గా వ్యవహరించిన

ఏస్ నెక్స్ట్‌జెన్ రెండో రేసు నిర్వహణ నుంచి వైదొలగడంతో ఆ బాధ్యత ప్రభుత్వం తీసుకుందని కేటీఆర్ చెప్పినట్లు సమాచారం. కొత్త స్పాన్సర్‌ను వెతికేందుకు సమయం లేకపోవడంతో హెచ్ఎండీఏ నుంచి నిధులు మంజూరు చేశామని, తన ఆదేశాల ప్రకారమే ఇది జరిగిందని, ఇందులో ఎలాంటి దురుద్దేశాలు లేవని, ఎక్కడా అవినీతి జరగలేదని వివరించినట్లు తెలిసింది.



# తిరుపతి ఘటనపై చంద్రబాబు సీరియస్

**అధికారుల తీరుపై మండిపడ్డ సిఎం**

**కొత్త ప్రదేశం ఎంపిక చేస్తే జాగ్రత్తలు తీసుకోరా**

**అంబులెన్స్ ఆలస్యంపైనా అధికారులపై అసహనం**

**బాధ్యతలు తీసుకున్నప్పుడు సక్రమంగా నెరవేర్చరా**

**బైరాగిగడ్డ ఘటనా స్థలిని పరిశీలించిన చంద్రబాబు**

**అధికారుల అలసత్వంపై తీవ్ర ఆగ్రహం**

**తిరుపతి:** తిరుపతి తొక్కిసలాట ఘటన నేపథ్యంలో అధికారులపై సీఎం చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన వారిని వదిలే సమస్యే లేదని హెచ్చరించారు. టీటీడీ అధికారులపైనా సీఎం సీరియస్ అయ్యారు. ఇంత జరుగుతున్నా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కొత్త ప్రదేశంలో పంపిణీకి సిద్ధమైనప్పుడు అధికారులు ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. పలువురు అధికారులు సీఎంకి సమాధానం చెప్పారు. డీఎస్పీ వల్లే ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. భక్తులు మొదట ప్రశాంతంగానే ఉన్నారని.. ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోకుండా డీఎస్పీ గేటు తెరవడంతో ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు సమాధానమిచ్చారు. అనంతరం సీఎం బాధితులను కలిసేందుకు ఆస్పత్రికి వెళ్లారు. వాళ్ళు ఎవరో పెట్టారని మీరు కూడా అదే ఫార్ములాను పాటించడమేంటని సీఎం ఫైర్ అయ్యారు. 'ఘటన జరకముందు చేస్తే అడ్మినిస్ట్రేషన్ జరిగాక చేస్తే గుడ్ అడ్మినిస్ట్రేషన్ ఎలా అవుతుంది? టెక్నాలజీని వాడుకుని టికెట్లు ఇవ్వడం తెలియదా? జేఈవోగా మీరు చేయాల్సిన బాధ్యత గుర్తులేదా? భక్తుల రద్దీనీ దృష్టిలో పెట్టుకుని టికెట్లు ఇవ్వాలని తెలియదా? భక్తుల నుంచి ఫిర్యాదు వస్తే మీరేం చేశారు? ఘటన తరువాత మీరు చేసింది ఏంటి? కనీసం వాట్సాప్ గ్రూప్ ద్వారా మీ సిబ్బంది అదేశాలు ఇవ్వలేరా?' అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. తిరుపతిలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాలను ఏపీ సీఎం చంద్రబాబు పరిశీలించారు. విజయవాడ నుంచి

బయల్దేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి తిరుపతి వచ్చారు. నగరంలోని బైరాగిపట్టెడ వద్ద ఘటనాస్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఘటనకు గల కారణాలు, ప్రభుత్వం తరఫున బాధితులకు అందిస్తున్న సహాయ కార్యక్రమాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తితిదే ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలన్నారు. 'భక్తుల రద్దీ పెరుగుతుంటే తితిదే అధికారులు ఏం చేస్తున్నారు? ప్రతి ఒక్కరికీ చెబుతున్నా.. బాధ్యత తీసుకున్నప్పుడు దాన్ని నెరవేర్చాలి. తమాషా అనుకోవద్దు' అని వ్యాఖ్యానించారు.

## ఢిల్లీ ఎన్నికల్లో ఒక్కస్థానం నుంచే పోటీ చేస్తున్నా : కేజ్రీవాల్



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. మరో నెల రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో.. అధికార, విపక్ష పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారంటూ బీజేపీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. న్యూ ఢిల్లీతోపాటుమరో స్థానం నుంచి కేజ్రీ పోటీ చేయబోతున్నారంటూ బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై కేజ్రీవాల్ తాజాగా స్పందించారు. బీజేపీ నేతల ఆరోపణలను ఖండించారు. తాను కేవలం ఒక్క స్థానం నుంచే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా, న్యూ ఢిల్లీ స్థానం నుంచి కేజ్రీ వరుసగా నాలుగోసారి పోటీకి సిద్ధమయ్యారు. ఈ స్థానం నుంచి కేజ్రీవాల్‌పై బీజేపీ తరఫున మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. మరోవైపు 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు 67, 62 స్థానాలతో ఆప్ క్లీన్ స్వీప్ చేసింది.



# అమల్లోకి వచ్చిన భూభారతి చట్టం

**బిల్లుకు ఆమోద ముద్ర వేసిన గవర్నర్**

**సత్వరం చట్టం అమలకు చర్యలు తీసుకుంటాం**

**రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి**

**హైదరాబాద్:** 'భూ భారతి-2024' చట్టానికి గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఇది చట్టరూపం దాల్చింది. గవర్నర్ ఆమోదం తెలపటంతో వీలైనంత త్వరగా చట్టాన్ని అమల్లోకి తెస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గవర్నర్ ఆమోదించిన భూ భారతి చట్టం బిల్లు కాపీని సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ మంత్రి పొంగులేటికి అందజేశారు. ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

చరిత్రాత్మక భూ భారతి చట్టాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదించడంతో వీలైనంత త్వరగా ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు.

# సుప్రీంలో కెటిఆర్‌కు చుక్కెదురు

**క్వాష్ పిటిషన్ అత్యవసర విచారణకు నో**

**15న విచారిస్తామన్న చీఫ్ జస్టిస్ ఖన్నా**



**న్యూఢిల్లీ:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించలేదు. ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను శుక్రవారం విచారణకు తీసుకునేందుకు చీఫ్ జస్టిస్ నిరాకరించారు. ఈనెల 15న సుప్రీంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగనుంది. 15వ తేదీన విచారణకు లిస్ట్ చేసినందున అదే రోజు విచారిస్తామని సీజే స్పష్టం చేశారు. అప్పటి దాకా కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు... కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన విషయం తెలిసిందే. అలాగే మధ్యంతర ఉత్తర్వులను కూడా హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో కేటీఆర్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణకు తీసుకోవాలని కేటీఆర్ తరఫు న్యాయవాదులు కోరినప్పటికీ సుప్రీం కోర్టు సీజేఐ నిరాకరించారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన వెంటనే సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే దాన్ని అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదంటూ 15 విచారణ జరుపుతామంటూ ఆరోజు లిస్ట్ చేశారు.

అయితే ఈరోజు కేటీఆర్ తరఫు న్యాయవాదులు సీజేఐ ధర్మాసనం ముందు హాజరై.. ఇది చాలా సున్నితమైన అంశమని.. కేటీఆర్ అరెస్ట్ అయ్యే అవకాశం ఉన్నందున్న ఈరోజు లేదా రేపు విచారణ జరపాలని కేటీఆర్ న్యాయవాదు కోరారు. అయితే ఇది అంత అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడుతూ ఈనెల 15న విచారణకు లిస్ట్ చేసినందున ఇక ఆరోజే విచారస్తామని సంజీవ్ కన్నా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# తిరుపతి ఘటనపై చంద్రబాబు సీరియస్



నియంత్రణకు ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకున్నారని అధికారులను ప్రశ్నించారు. ఇంతమంది అధికార యంత్రాంగం ఉండి టికెట్ల పంపిణీ ఎందుకు సవ్యంగా చేయలేకపోయారు?.. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఎన్ని టికెట్లు జారీ చేశారు... ఘటనా స్థలానికి అంబులెన్స్ ఎన్ని గంటలకు వచ్చిందంటూ వరుసగా సీఎం ప్రశ్నలు సంధించారు. భక్తుల రద్దీ పెరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని.. పద్ధతి ప్రకారం పనిచేయడం నేర్చుకోవాలని హెచ్చరించారు. బాధ్యత తీసుకున్నవారు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. పరిమితికి మించి భక్తులను లోపలికి ఎందుకు పంపించారని అడిగారు. భక్తులను బయటకు వదిలేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి కదా అంటూ చంద్రబాబు ఫైర్ అయ్యారు. ఈ కేంద్రం వద్ద ఎందుకు ఫెయిల్యూర్ అయ్యారు. భక్తులను ఉంచేందుకు కొత్త ప్లేస్ ఎంపిక చేసుకున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలి కదా. ఇక్కడ నియమించిన పోలీస్ ఆఫీసర్‌కు జాగ్రత్తలు చెప్పారా. ఆ గేటు తీస్తే తొక్కిసలాట జరుగుతుందని ఎందుకు ఊహించలేదు' అంటూ కలెక్టర్‌పై చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు వెంట మంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు తదితరులు ఉన్నారు.

# ఫార్ములా కేసులో ముగిసిన కెటిఆర్ విచారణ

హైదరాబాద్: ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కాగా..దాదాపు ఆరున్నర గంటలపాటు ఎసిబి అధికారులు చేసిన విచారణ ముగింసింది. ఫార్ములా కేసులో నిధుల మళ్లింపుపై కేటీఆర్‌ను విచారించేం దుకు ఏసీబీ అధికారులు ఆయనను నడిపించి విచారణ కోసం తీసుకొచ్చారు. ఈ కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్.. కేటీఆర్‌ను విచారించారు. ఈ విచారణను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షించారు. విచారణను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాది రామచంద్రరావును అనుమతించారు. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరుకావాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో పెద్ద మొత్తంలో నిధుల చెలామణీ, అన్యాయంగా ఆర్థిక లావాదేవీలు జరగడం వివాదంగా మారింది. ఈ వివాదంలో కేటీఆర్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో విచారణకు ఎప్పుడు పిలిచినా కూడా రావాలని ఏసీబీ తెలుపగా, కేటీఆర్ వస్తానని చెప్పారు. కేటీఆర్‌కు ఈ కేసులో అనేక ఆరోపణలు వచ్చాయి, అవి నిరూపించ డానికి ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. గత కొన్ని రోజులుగా ఈ కేసు చుట్టూ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కేటీఆర్‌ను ముగ్గురు ఏసీబీ అధికారులు



ప్రశ్నించారు. అరవింద్ కుమార్, దానకిషోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా ఈ విచారణ జరగింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ ప్రాజెక్టులో నియమాలను ఉల్లంఘించి రూ.55 కోట్లు ఎఫ్‌ఈవోకు బదిలీ చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై ఏసీబీ కేటీఆర్‌ను విచారించింది. అయితే కేటీఆర్ విచారణ సందర్భంగా న్యాయవాదికి అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. ఈ ఆదేశం ప్రకారం కేటీఆర్ విచారణను అనుసరించి, న్యాయవాది లైబ్రరీలో కూర్చోవడం ద్వారా ఏసీబీ చర్యలు తీసుకుంది. కేటీఆర్–న్యాయవాది సంభాషణలకు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ విచారణ తర్వాత కేటీఆర్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసేందుకు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఆఫీస్‌లో విచారించారు. ఆయనను ప్రధాన నిందితుడిగా పేర్కొనడం, స్టేట్‌మెంట్ రికార్డు చేయడం తదితర చర్యలు తీసుకున్నాయి. దీంతో ఈ కేసు విషయంలో తర్వాత ఎలాంటి పరిణామాలు ఉంటాయేనని రాజకీయ వర్గాలతోపాటు అనేక మంది ఆసక్తితో ఉన్నారు. ఏసీబీ విచారణ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'పూర్తి స్థాయిలో ఏసీబీ విచారణకు సహకరించా. నాకున్న అవగాహన మేరకు ఏసీబీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా. విచారణకు ఎప్పుడు పిలిచినా, ఎన్ని సార్లు పిలిచినా వచ్చి సహకరిస్తానని చెప్పా. మళ్లీ ఎప్పుడు పిలుస్తారో తెలియదు. ఇది ఒక చెత్త కేసు. రాజకీయ ఒత్తిడితో మీరు ఏం చేస్తున్నారో కూడా మీకే తెలియడంలేదు, పూర్తిగా అసంబద్ధమైన కేసు అని అధికారులకు చెప్పాను. నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు.. కొత్తగా అడిగిందేమీ లేదు. పైసలు పంపాను అని నేనే చెబుతున్నాను.. డబ్బులు వచ్చాయని వాళ్ళు చెబుతున్నారు. ఇందులో అవినీతి ఎక్కడ జరిగిందని అడిగా' అని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ మీడియాతో మాట్లాడుతుండగా డీసీపీ విజయ్‌కుమార్ అభ్యంతరం తెలిపారు. మీడియాతో మాట్లాడితే భయమెందుకని కేటీఆర్.. డీసీపీని ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, ఇక్కడ మీడియా సమావేశం పెట్టవద్దని సూచించారు.

పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టుకోవాలన్నారు. మీడియా ప్రతినిధులను పోలీసులు తోసేయడంతో... కేటీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే పలు రకాల ప్రశ్నలనే 40 విధాలుగా అడిగారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు తాను చెప్పాల్సినది చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు. అంతేకాదు ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, రేవంత్ చెప్పిన ప్రశ్నలనే అధికారులు అడిగారని కేటీఆర్ అన్నారు. మరోవైపు కేటీఆర్ విచారణ నేపథ్యంలో అరెస్ట్ అవుతారా అని బీఆర్‌ఎస్ వర్గాలు భయాందోళన చెందాయి.

# చరిత్రలో చూడని ఘోరం ఇది

తిరుపతి:తిరుమల చరిత్రలో ఎప్పుడూ జరగని ఘోరం చూశామని మాజీ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. చంద్రబాబు అసమర్థత ఈ ఘటనతో స్పష్టమైందని విమర్శిచారు.. ఘటనకు కారణమెవరో కనుక్కోకుండా నీతి మాలిన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.. అధికారులను, టీటీడీ బోర్డును ఎవరు పెట్టారని ప్రశ్నించారు.. భక్తులకు సర్వీస్ చేయాలన్న ఉద్దేశ్యం ఎవరికి లేదన్నారు.. అధికారులు చంద్రబాబు దగ్గర భజన చేస్తూ తిరుగుతూ భక్తులను గాలికి వదిలేశారని విమర్శించారు.. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనకు ఎవరు బాధ్యులో తేల్చాలని డిమాండ్ చేశారు. అసమర్ధ టీటీడీ చైర్మన్, ఎస్పీ, కలెక్టర్ వలనే ఈ పరిస్థితి వచ్చిందని.. వీరు ఎవరికీ భక్తి లేదన్నారు. చంద్రబాబు భజనే వీరికి ముఖ్యమంటూ విరుచుకుపడ్డారు. పోలీసులను చంద్రబాబు సేవలో పెట్టారని.. వచ్చిన భక్తులకు కనీసం సౌకర్యాలు కూడా కల్పించలేదని ఆరోపించారు. ఇది ప్రభుత్వం చేసిన హత్యలే అని.. అందరిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. హీరో అల్లు అర్జున్‌కు సంబంధం లేకుండా తొక్కిసలాట జరిగితే ఆయనపై కేసు పెట్టారని.. మరి తిరుపతి ఘటనలో చంద్రబాబు నుంచి బీఆర్ నాయుడు, ఎస్పీలపై కేసులు పెట్టాలన్నారు. గత ఏడాది వైసీపీ హయాంలో ఎలా చేశామో అందరూ చూశారన్నారు. భక్తులకు కనీస సదుపాయాలు లేవు.. ఘటనకు నిర్లక్ష్యం



కారణం కాదు.. ఇవి ప్రభుత్వం చేసిన హత్యలు.. తెలంగాణలో చూసాం.. ఓ ఘటనలో మహిళ చనిపోతే అల్లు అర్జున్ పై కేసు పెట్టారు.. ఈ ఘటనలో చంద్రబాబు నుంచి క్రింది స్థాయి అధికారులు బాధ్యత వహించాలి.. ఘటనను ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనలా కేసులు నమోదు చేశారు.. విజయవాడ హైందవ శంఖారావంలో చెప్పారు.. హిందువులను కాపాడాలని చెప్పారు.. ఇప్పుడు ఆ పీఠాధిపతులు ఏమయ్యారు.. తిరుమల లడ్డుపై బీజేపీ, టీడీపీ నేతలు ఎన్ని మాట్లాడారో అందరూ చూశారు.. మీరు చేస్తే కరెక్టు.. మరొకరు చేస్తే తప్పు అన్నట్లు చేస్తున్నారు.. ప్రధాని మోడీకి ఒకటే విజ్ఞాపన చేస్తున్నా.. బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. సనాతన యోధుడు ఈ ఘటనకు ఏ ప్రాయశ్చిత్తం చేస్తారు.. చంద్రబాబుతో రాజీనామా చేయిస్తారా.. మీరు చేస్తారా.. అంటూ పవన్ కళ్యాణ్‌పై విమర్శలు గుప్పించారు. హోం మంత్రి కేవలం ఇతరులను తిట్టడానికి తప్ప లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేయటానికి పనికి రావటం లేదు.. తొక్కిసలాటకు కారణమైన బాధ్యుతలపై క్రిమినల్ కేసులుపెట్టి లోపలేయాలి.. చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చి వల్ల గోదావరి పుష్కరాల్లో 29 మంది ప్రాణాలు కోల్పోయారు.. ఘటనకు నిర్లక్ష్యం కారణం కాదు.. ప్రభుత్వం చేసిన హత్యలు.. చంద్రబాబు వైఫల్యం, అసమర్ధత వల్లే ఇంతమంది చనిపోయారు.' అని మాజీ మంత్రి రోజా వ్యాఖ్యానించారు. చంద్రబాబు అసమర్ధ పాలనకు నిదర్శనంగా తిరుపతి ఘటన ఉందని మాజీ మంత్రి ఆర్కే రోజా వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ కూడా దీనిపై స్పందించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దారుణాలు జరుగుతున్నాయని అంటూ కామెంట్స్ చేశారు. సనాతన యోధుడిని అని చెప్పుకునే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఆరుగురిని చంపేసిందని.. ఎవరి నిర్లక్ష్యం వలన జరిగిందో తేల్చాలన్నారు.

అందరిపై కేసులు పెట్టించుకుని విచారణ జరిపించుకోవాలని అన్నారు. చంద్రబాబు లెగ్ మహిమ వలన ఎప్పుడూ జనాల చావులు తప్పటం లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గోదావరి పుష్కరాల సమయంలో 29 మంది చనిపోయారని.. విజయవాడలో వరదల వలన 60 మంది చనిపోయారని.

. అదంతా చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం వలనే అంటూ ఆరోపణలు గుప్పించారు. అయినా సరే ఈ పాలకులకు బాధ అనిపించటం లేదన్నారు. గేమ్ ఛేంజర్ సినిమా ఫంక్షన్ మీద ఉన్న పిచ్చి శ్రీవారి భక్తుల మీద ఎందుకు చూపటంలేదని ప్రశ్నించారు. టీటీడీని టీడీపీ ఆఫీసులాగ మార్చేశారని దుయ్యబట్టారు. వైకుంఠ ఏకాదశికి ఎలాంటి సౌకర్యాలు కల్పించాలో టీటీడీ ఛైర్మన్‌కు తెలీదన్నారు. ఆయనకు భక్తి భావమే లేదని.. అలాంటి వారికి ఛైర్మన్ పదవి ఎలా ఇస్తారని అన్నారు. ఎవరిని బలి చేద్దామా? అని టీటీడీ, ప్రభుత్వం ఆలోచన చేస్తోందంటూ వ్యాఖ్యలు చేశారు. ఎస్పీని రక్షించటానికి డీఎస్పీ మీదకు నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం సిన్సియర్‌గా స్పందించి విచారణ జరపాలని మాజీ మంత్రి ఆర్కే రోజా డిమాండ్ చేశారు.

# తొక్కిసలాట ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

## మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

**అమరావతి:** తిరుపతి తొక్కిసలాట ఘటనపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీవారి భక్తులు మృతి చెందడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఈ దుర్ఘటనలో గాయపడ్డవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఇలా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచార కరమని అన్నారు. తక్షణం అక్కడ పరిస్థితులను చక్కదిద్దడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న భక్తులు త్వరగా కోలుకోవాలని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు.

తొక్కిసలాట జరిగి భక్తులు మరణించడం తిరుపతి ఆలయ చరిత్రలోనే ఇది తొలిసారి. గాయపడ్డవారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను కోరారు.

# ఏసీబీ విచారణకు హాజరైన మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్: ఫార్ములా–ఈ కారు రేసు వ్యవహారంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. మాజీ ఏఏజీ, న్యాయవాది రామచంద్రరావుతో కలిసి కేటీఆర్ ఏసీబీ ఆఫీస్‌కు వెళ్లారు. అంతకుముందు నందినగర్‌లోని తన నివాసంలో లీగల్ టీమ్‌తో చర్చించారు. అందేవిధంగా ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. కాగా, కేటీఆర్ ఏసీబీ విచారణకు వెళ్తుండటంతో పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ బిడ్డగా, తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఒక కార్యకర్తగా, కేసీఆర్ సైనికుడిగా స్వచ్ఛమైన మనసుతో, నిర్మలమైన హృదయంతో మరోసారి చెబుతున్నా.. తెలంగాణ ప్రతిష్ట పెంచడానికి, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయం చేయడానికి, హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలపడానికి రాష్ట్ర మంత్రిగా ఎన్నో ప్రయత్నాలు చేశానన్నారు. అవి ఫలించి హైదరాబాద్, తెలంగాణ భారత దేశంలోనే ఒక ప్రధానమైన నగరంగా ప్రపంచ దృష్టిని ఆకర్షించే స్థాయికి తీసుకొచ్చేలా పనిచేశాం. తొమ్మిదిన్నర పదేండ్ల తమ ప్రభుత్వంలో మా బావమర్దులకు రూ.11 వందల 37 కోట్ల కాంట్రాక్టులు ఇచ్చే దౌర్భాగ్యపు పని చేయలేదని తెలిపారు. మంత్రిగా నేను మంత్రిమండలిలో కూర్చుని నా కొడుకు కంపెనీలకు కాంట్రాక్టులు ఇచుకోలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టులు ఇచ్చి ప్రతిఫలంగా ల్యాండ్‌క్రూజర్ కొనుక్కోలేదు. ఆ పనులు రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు చేశారన్నారు. ఆ చావు తెలివితేటలు, అవినీతి తెలివితేటలు వాళ్లకే ఉన్నాయని పేర్కొన్నారు. నేను రూ.55 లక్షతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి పోయి దొరికిపోయిన దొంగను కూడా కాదని తెలిపారు. నేను నిఖార్సయిన తెలంగాణ బిడ్డఅని తేల్చిచెప్పారు. ఏ పనిచేసినా తెలంగాణ కోసం, హైదరాబాద్ ప్రతిష్టను పెంచడానికి చేశానని తెలిపారు. అరపైసా అవినీతి చేయలేదని, చేయబోను అని అన్నారు. కొంత మంది అర్థమై కానివాళ్లు, తెలిసీ తెలియని వాళ్లు, ఏదో కొంత బురదజల్లి తాత్కాలికంగా మీడియా మేనేజ్‌మెంట్ ద్వారా రాజకీయ పబ్బం గడుపుకోవాలనుకునే కాంగ్రెస్ వాళ్లకు చెప్పేదొకటే.. నిజం నిలకడమీద తెలుస్తుందన్నారు. మీరు ఇవ్వాళ జల్లే బురద నన్నుగానీ, మా పార్టీని కానీ ఎట్టి పరిస్థితుల్లో మాదృష్టిని మరల్చలేదన్నారు. మేము మాట్లాడుతూనే ఉంటాం. కొట్లాడుతూనే ఉంటాం. గత ఏడాది కాలంగా విద్యుత్ చార్జీలు పెంచొద్దని కొట్లాడింది బీఆర్‌ఎస్. లగచర్లలో రైతులను జైల్లో పెడితే అడ్డుకున్నది బీఆర్‌ఎస్. హైడ్రా పేరుతో ఇండ్లు కూలగొడితే అడ్డుకున్నది బీఆర్‌ఎస్. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే అడుగడుగునా నిలదీసింది కేసీఆర్ బృందం. మా దృష్టిని మేం మరల్చం. నామీద కేసుపెట్టి నన్నేదో చేసి దానివల్ల మా పార్టీ క్యాడర్‌ను, నాయకత్వాన్ని నువ్వు దారి మళ్లింపు, దృష్టి మళ్లింపు దిశగా ప్రయత్నం చేస్తానని అనుకుంటున్నవ్ రేవంత్ రెడ్డి. అది నీవల్ల కాదు. ముమ్మాటికీ నువ్విచ్చిన 420 హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటాం. ఇదే కాదు ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటాం. న్యాయస్థానాలపై, ఈ దేశంలోని చట్టాల మీద, భారత రాజ్యాంగంపై మాకు సంపూర్ణ గౌరవం, విశ్వాసం ఉన్నది. నువ్వు ఏ ప్రశ్నలన్నా అడుగు సమాధానం మావద్ద ఉంది. ఎందుకంటే మేం నిజాయితీగా ఉన్నాం. నీలాగా లుచ్చా పనులు చేయలేదు, తుచ్ఛపు పనులు చేయలేదు. చేయబోము. నికార్సయిన తెలంగాణ బిడ్డగా.. కేసీఆర్ రక్తం పంచుకుని పుట్టిన కొడుకుగా చెబుతున్నా.. తెలంగాణ కోసం అవసరమైతే చస్తాను తప్ప ఇలాంటి లుచ్చాల ముందు తల వంచను. తప్పకుండా కొట్లాడుతూనే ఉంటా. పోరాడుతూనే ఉండా. తెలంగాణ జయించేదాకా, కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి తెలంగాణ బయటకు వచ్చేదాకా కొట్లాడుతూనే ఉంటా'నని కేటీఆర్ స్పష్టం చేశారు.

# జిహెచ్ఎంసి వద్ద కంట్రాక్టర్ల మెరుపు ధర్నా

**హైదరాబాద్:** హైదరాబాద్ మహానగర పాలక సంస్థ జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బల్దియా కాంట్రాక్టర్లు మెరుపు ధర్నాకు దిగారు. గురువారం ఉదయం కాంట్రాక్టర్లంతా ధర్నాకు దిగారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే తమకు రావాల్సిన బకాయలు రూ. 1100 కోట్లు చెల్లించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ క్రమంలో ఓ కాంట్రాక్టర్.. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పూనుకొన్నాడు. అక్కడే ఉన్న సహచర కాంట్రాక్టర్లు.. అతడి ప్రయత్నాన్ని అడ్డుకొన్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జీహెచ్ఎంసీ బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల బాధతో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు ఆందోళనకు దిగారు. కార్యాలయం ప్రధాన ద్వారం ముందు బైఠాయించిన కాంట్రాక్టర్లు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏడాదిగా బిల్లులు చెల్లించడం లేదని కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డారు. ఇంతలోనే ఉన్నట్టుండి ఇద్దరు కాంట్రాక్టర్లు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. తోటి కాంట్రాక్టర్లు వారిని అడ్డుకుని పెట్రోల్ బాటిళ్లను లాగేసుకున్నారు. అప్రమత్తమైన జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి.. కాంట్రాక్టర్లను చర్చలకు పిలిచారు. పెండింగ్ బిల్లులపై కమిషనర్ ఇలంబర్తి.. కాంట్రాక్టర్లతో చర్చలు జరిపారు. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన కాంట్రాక్టర్లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వారిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నిజ్జర్ హత్య కేసులో నలుగురికి ఊరట

**న్యూఢిల్లీ:** ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటనలో అరెస్టయిన నలుగురికి బెయిల్ మంజూరయ్యింది. ఈ హత్యా ఘటన తరవాత భారత్, కెనడా ల మధ్య దౌత్య విభేదాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన టొరంటో పోలీసులు.. గతేడాది నలుగురు భారతీయులను నిందితులుగా పేర్కొంటూ అరెస్టు చేశారు. తాజాగా వారికి బెయిల్ మంజూరైంది. నిజ్జర్ కేసు లో ఫస్ట్ డిగ్రీ అభియోగాలపై కరణ్ బ్రార్, కమల్ ప్రీత్ సింగ్, కరణ్ ప్రీత్ సింగ్, అమర్‌దీప్ సింగ్‌ను గతేడాది మే నెలలో కెనడా పోలీసులు అరెస్టు చేశారు. భారత్‌కు చెందిన వీరిలో ముగ్గురు ఎడ్మంటర్ ప్రాంతంలో నివసిస్తుండగా.. అమర్‌దీప్ బ్రాంప్టన్ వాసి. గత కొన్ని నెలలుగా జైల్లో ఉన్న వీరికి కెనడాలోని దిగువ కోర్టు తాజాగా బెయిల్ మంజూరుచేసింది. అనంతరం ఈ కేసు విచారణను బ్రిటీష్ కొలంబియా సుప్రీంకోర్టుకు బదిలీ చేస్తున్నట్లు తెలిపింది. దీనిపై ఫిబ్రవరి 11న తదుపరి విచారణ జరగనుంది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ 2023 జూన్‌లో బ్రిటిష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటన వెనక భారత ఏజెంట్ల హస్తం ఉందంటూ అప్పట్లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. వాటిని సమర్థించే ఆధారాలు ఇవ్వాలని.. ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని పలుమార్లు స్పష్టంగా చెప్పింది. అయినప్పటికీ కెనడా మాత్రం ఆరోపణలు చేయడం మానలేదు. ఈక్రమంలోనే నిజ్జర్ హత్య కేసు అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మ పేరును చేర్చడంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సంజయ్‌వర్మ సహా ఆ దేశంలోని మన దౌత్యవేత్తలను భారత్ వెనక్కి రప్పించింది. అదే సమయంలో దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించాలన్న నిర్ణయం తీసుకుంది. దీంతో ఒట్టావా కూడా మన దౌత్యవేత్తలపై బహిష్కరణ వేటు వేసింది.

# క్షతగాత్రులకు మంత్రి సత్యకుమార్ పరామర్శ

**తిరుపతి:** ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తిరుపతి తొక్కిసలాట బాధితులను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి తొక్కిసలాట ఘటన బాధాకరమన్నారు. మృతుల సంఖ్యపై స్పష్టత ఇచ్చారు. 'చిన్న చిన్న దెబ్బలు తగిలిన అందరూ కోలుకుంటున్నారు.. ఒక వ్యక్తి కి ఫాక్చర్ గాయాలు ఉన్నాయి.. తొక్కిసలాట లో ఐదుగురు చనిపోయారు.. క్యూ లైన్ లో అస్వస్థత కు గురై ఒకరు చనిపోయారు.. మృతి చెందిన ఆరుగురు మినహా , తీవ్ర గాయాలు ఎవరికి లేవు.. స్విమ్స్ లో 29 మందికి ఇప్పటికీ చికిత్స అందిస్తున్నారు.. జరిగిన ఘటన వెనుక ఎవరి నిర్లక్ష్యం ఉన్నా కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. తిరుపతిలో తొక్కిసలాట ఘటనలో ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. క్షతగాత్రులు పద్మావతి వైద్య కళాశాలలో చికిత్స పొందుతున్నారు. వారిని ఈవో శ్యామలరావు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తొక్కిసలాట ఘటన దురదృష్టకరమన్నారు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారని.. 41 మందికి గాయాలయ్యాయని తెలిపారు. ప్రస్తుతం విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. డీఎస్పీ గేట్లు తెరవడం వల్లే ఘటన జరిగినట్లు ప్రాథమికంగా తేలినట్లు చెప్పారు. విచారణ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. 'ప్రాథమిక చికిత్స అనంతరం కొందరిని వైద్యులు డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారికి చికిత్స జరుగుతోంది.' అని వెల్లడించారు. ఇదిలా ఉండగా..మంత్రులు అనిత.. ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్ రుయా ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు చేరుకున్నారు. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులను కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు వారికి వివరించారు. బాధితులను మంత్రులు పరామర్శించారు. కుటుంబీకులను కోల్పోయిన బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

వేగుచుక్క

# కామారెడ్డి కలెక్టరేట్ లో "సంక్రాంతి" సంబరాలు.






టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు.
అభినందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.







**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 9:**

టీఎన్జీవోస్ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో ఘనంగా సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళ ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి రజిత వ్యవహరించారు. మొదటి బహుమతి వీణ, (స్రవంతి (ఐసిడిఎస్) ద్వితీయ బహుమతి సౌమ్య జమున (బీసీ వెల్ఫేర్ ) తృతీయ బహుమతి ప్రియాంక (పోస్టల్ శాఖ ఐడిఓసి), నాలుగవ బహుమతి రాజ్యలక్ష్మి, స్వప్న (ట్రెజరీ) గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉద్యోగు లు ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా ఉద్యోగులు అన్ని రంగాల్లో ముందు ఉండి జిల్లా కార్యాలయాల్లో వారి పనులను సంతృప్తికరంగా నిర్వహించుకుని, మంచి పేరును తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, టిఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు నరాల వెంకటరెడ్డి, సహ అధ్యక్షులు చక్రధర్, కోశాధికారి దేవరాజు ఉపాధ్యక్షులు యు. సాయిలు, లక్ష్మణ్, రాజ్యలక్ష్మి, జాయింట్ సెక్రటరీ రాజమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్, సభ్యులు సాయినాథ్, రంజిత్, దత్తాద్రి, శ్రీనివాస్ రెడ్డి, సృజన్, పవన్ నితిన్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు.



**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జనవరి 9:**

రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.విద్యార్థినిలు ఈ పోటీలో ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. ఉత్తమంగా ఎంపికైన ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మరో పదిమందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ అధ్యక్ష కార్యదర్శులు పద్మ శ్రీనివాస్ గుప్తా, గౌరీ శంకర్, ప్రాజెక్ట్ చైర్మన్ కోటగిరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 10 న "దక్కన్ సర్కర్" సినిమా ఆడియో లాంచ్.

**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్, జనవరి 9:**

కళ ఆర్ట్స్ బ్యానరులో, జిల్లాకు చెందిన కళా శ్రీనివాస్ దర్శకత్వంలో నిర్మించబడుతున్న "దక్కన్ సర్కర్" సినిమా కు సంబంధించినటువంటి ఆడియో లాంచ్ కార్యక్రమం ఈ నెల 10 న, శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నిజామాబాద్ లోని న్యూ అంబెద్కర్ భవనంలో కలదని డైరెక్టర్ కళా శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమనికి సినిమాకి సంబంధించినటువంటి నటి నటులు, సాంకేతిక నిపుణులు, ప్రముఖులు అందరూ హాజరవుతున్నారని, ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ప్రజలు అందరు భాగస్వాములు అయి, ఈ కార్యక్రమన్నీ విజయవంతం చేయవలసిందిగా డైరెక్టర్ కళా శ్రీనివాస్ కోరారు.




# ఆర్ఎంపీల వద్ద శిక్షణ... వైద్యుడిగా చలామణి.

- అరెస్టు చేసిన కామారెడ్డి పోలీసులు.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 9:**



ఆర్ఎంపీ వైద్యుల వద్ద శిక్షణతో, చికిత్స వివరాలు తెలుసుకుని కామారెడ్డితో పాటు పలు ప్రాంతాల్లో వైద్యుడిగా చలామణి అవుతున్న వ్యక్తి గుట్టురట్టు చేశారు కామారెడ్డి పోలీసులు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఫిర్యాదు మేరకు నకిలీ వైద్యుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. గురువారం కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన ముల్కల రవీందర్ డిగ్రీ ఫెయిల్ అయ్యాడు. అయితే డబ్బు సంపాదనే లక్ష్యంగా ఆర్ఎంపీ వైద్యుల వద్ద చికిత్స నేర్చుకున్నాడు. తన పేరును రవీందర్ రెడ్డిగా ఫోటో షాప్ లో ఆధార్ కార్డు, నకిలీ సర్టిఫికెట్ తయారు చేసి ఫోటో మార్పు చేసుకున్నాడు. ఫేక్ సర్టిఫికెట్‌తో కామారెడ్డి స్టార్ హాస్పిటల్‌లో, ఆరోగ్య ఆస్పత్రిలో, లింగంపేట భీమరాజు ఆస్పత్రిలో ఎంబీబీఎస్, ఎండీ, జనరల్ మెడిసిన్, పిల్లల వైద్యుడిగా కొనసాగాడు. ఖానాపూర్‌లోని షణ్ముఖ ఆస్పత్రిలో పిల్లల వైద్యుడిగా పని చేయడానికి ఈనెల 6న అడ్వాన్స్ గా రూ.2 లక్షలు తీసుకున్నాడు. అయితే రవీందర్ రెడ్డి అనే వ్యక్తి అసలు వైద్యుడే కాదని తెలంగాణ మెడికల్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతని వద్ద నుంచి ఫేక్ ఆధార్ కార్డు, సర్టిఫికెట్లు, మొబైల్ ఫోన్, ల్యాప్ టాప్ స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో హాజరు పరుస్తామని ఏఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో కామారెడ్డి పట్టణ, రూరల్ సీఐలు చంద్రశేఖర్ రెడ్డి, రామన్, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు శ్రీరామ్, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా "అపూర్వ స్కూల్" వార్షికోత్సవం



**వేగుచుక్క న్యూస్, నిజమాబాద్:**



నగరంలోని ఖలీల్‌వాడిలో గల అపూర్వ స్కూల్ 25వ వార్షికోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి ముఖ్యంగా హనుమాన్ చాలీసా ,రామాయణ ఇతివృత్తంతో రూపొందించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కుసుమలత రెడ్డి , వైస్ప్రిన్సిపల్ స్మిత రెడ్డి ,ఉపాధ్యాయులు, విద్యార్థులు ,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పసుపు రైతులను ఆదుకుంటాం.

**వారి సంక్షేమం కోసం**
**రాజకీయాలకు అతీతంగా కృషి.**
**వ్యవసాయ, రైతు కమిషన్**
**చైర్మన్ ఎం.కోదండరెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 09**




: అనేక ఒడిదుడుకులను అధిగమిస్తూ, పవిత్రమైన పసుపు పంటను సాగు చేస్తున్న రైతాంగం ఇబ్బందులను పరిష్కరించి వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు రాజకీయాలకు అతీతంగా కృషి జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. చైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, కె.వి.నరసింహారెడ్డి, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, ఎం.భవాని తదితరులతో కూడిన బృందం గురువారం నిజామాబాద్ జిల్లాలో పసుపు సాగు చేస్తున్న ఆర్మూర్ డివిజన్ లోని ఆయా ప్రాంతాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో నెలకొని ఉన్న పరిస్థితులను పరిశీలించారు. పసుపు రైతులను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, కొండా లక్ష్మణ్ బాపూజీ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ రాజిరెడ్డి తదితరులతో కలిసి పసుపు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, ట్రేడర్లు, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, స్పైసెస్ బోర్డు అధికారులు తదితర వర్గాల వారితో అవగాహన సదస్సు నిర్వహించారు. సుగంధ ద్రవ్యాల బోర్డు ఆధ్వర్యంలో జిల్లాలో నెలకొల్పిన స్పైసెస్ బోర్డు ద్వారా పసుపు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటు గురించి సంబంధిత అధికారులు వివరించగా, ఆ సమాచారాన్ని క్షేత్రస్థాయిలోని ప్రతి పసుపు రైతుకు తెలిసేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చైర్మన్ కోదండరెడ్డి సూచించారు. కాగా, ఒకే రకమైన నాణ్యత కలిగిన పసుపు పంటకు స్థానికంగా తక్కువ ధర చెల్లిస్తుండగా, పక్కనే ఉన్న మహారాష్ట్రలో అధిక ధరకు కొనుగోలు చేస్తున్నారని సదస్సులో పాల్గొన్న పసుపు రైతులు చైర్మన్ దృష్టికి తెచ్చారు. స్థానికంగా కూడా కర్క్యుమిన్ ఆధారిత పసుపు మార్కెట్ ను అందుబాటులోకి తేవాలని, అధిక దిగుబడిని అందించే నాణ్యమైన వంగడాలను అందించాలని, పసుపును ఉడికించేందుకు ఎలక్ట్రిక్ బాయిలర్లు, పాలిషింగ్ యంత్రాలను రాయితీపై అందించాలని, మార్కెట్ యార్డులో దళారీ వ్యవస్థ లేకుండా చేయాలని, పసుపు పంటకు ధర నిలకడగా ఉండేలా చూడాలని రైతులు కమిషన్ ను కోరారు. కూలీల కొరత నెలకొని పెట్టుబడి ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను వ్యవసాయంతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ తదితరులు సైతం సదస్సులో పాల్గొని పసుపు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ, పసుపు రైతులు ప్రస్తావించిన అంశాలను, క్షేత్రస్థాయి పర్యటనలో తాము పరిశీలించిన విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సదస్సులో అదనపు కలెక్టర్ అంకిత్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, అధిక సంఖ్యలో పసుపు రైతులు పాల్గొన్నారు.

# తిరుపతి ఘటనకు ఇవో, ఎఇవోలదే బాధ్యత

**బాధ్యతల నిర్వహణలో ఈ ఇద్దరూ విఫలం**
**వీరి తప్పిదాలకు మేం తిట్లు తింటున్నాం**
**మృతులు కుటుంబాల ఇళ్లకు వెళ్లి క్షమాపణలు చెప్పండి**
**భక్తులకు గంటలోనే దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలి**
**తిరుపతిలో మీడియాతో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**

**తిరుపతి:**తొక్కిసలాట ఘటనకు తితిదే ఈవో, ఏఈవో బాధ్యత తీసుకోవాలని, ఘటనా స్థలిలో ఉన్న పోలీసులు కూడా బాధ్యత తీసుకోవాలని, తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు. అధికారులు చేసిన తప్పులకు మేం తిట్లు తింటున్నాం. తొక్కిసలాట జరిగితే సహాయక చర్యలు ఎలా ఉండాలనే ప్రణాళిక లేదు. వ్యక్తులు చేసిన తప్పులు రాష్ట్ర ప్రభుత్వంపై పడుతున్నాయి. భవిష్యత్తులో దుర్ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఆ క్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావుతోపాటు జేఈవో వెంకయ్య చౌదరిపై మండిపడ్డారు. బాధ్యతలు నిర్వర్తించడంలో టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వెంకయ్య చౌదరి విఫలమయ్యారన్నారు. ఈ ఘటనను బాధ్యతగా తీసుకోవాలని.. వారిద్దరికి ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సూచించారు. అధికారులు చేసిన తప్పిదానికి ప్రభుత్వం నిందలు మోస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీలో ప్రక్షాళన జరగాల్సి ఉందన్నారు. ఈ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన వారి ఇళ్లకు వెళ్లి.. క్షమాపణ చెప్పాలని టీటీడీ పాలకమండలిలోని సభ్యులకు పవన్ కల్యాణ్ సూచించారు. తిరుపతిలో తప్పు జరిగింది క్షమించాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలను కోరారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరగాలన్నారు. ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సామాన్యుల దర్శనాలపై దృష్టి పెట్టాలని టీటీడీకి సూచించారు. రద్దీని అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. ఈ ఘటనలో పోలీసుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అంతకు ముందు తిరుపతిలోని బైరాగి పట్టెడ పద్మావతి పార్కులో తొక్కిసలాట జరిగిన ప్రదేశాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల తీరుపై పవన్ కల్యాణ్ మండిపడ్డారు. భక్తులను ఒకే సారి ఎందుకు వదిలారంటూ వారిని ప్రశ్నించారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పరామర్శించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పైవిధంగా స్పందించారు. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున క్షమాపణలు చెబుతున్నట్టు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఘటన జరిగిన ప్రాంతంతో పాటు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'తప్పు జరిగింది.. బాధ్యత తీసుకుంటాం. క్షతగాత్రులు, రాష్ట్ర ప్రజలు, వేంకటేశ్వరస్వామి భక్తులు, హైందవ ధర్మాన్ని నమ్మిన ప్రతి ఒక్కరినీ క్షమించమని రాష్ట్ర ప్రభుత్వం అడుగుతోంది. ఈ ఘటన జరగకుండా ఉండాల్సింది. క్రౌడ్ మేనేజ్‌మెంట్ సరిగా జరగలేదని భక్తులు చెబుతున్నారు. తితిదే సిబ్బంది, పోలీసులు ఉండి కూడా ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. వీఐపీలపై కాదు.. సామాన్యులపైనా తితిదే దృష్టిపెట్టాలి. మృతుల కుటుంబాల వద్దకు తితిదే సభ్యులు వెళ్లి క్షమాపణలు చెప్పాలన్నారు.

'పోలీసుల్లో కొందరు కావాలని చేశారా? అనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఈ అనుమానాలన్నింటిపై విచారణ జరగాల్సి ఉంది. ఈవో, అదనపు ఈవో, పాలకమండలికి మధ్య గ్యాప్ ఉందనే వాదన ఉంది. ఇంతమంది పోలీసు అధికారులున్నా తప్పు ఎందుకు జరిగింది? పోలీసుశాఖ నిర్లక్ష్యంపై సీఎం, డీజీపీ దృష్టికి మళ్లీ తీసుకెళ్తా. తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం 8-9 గంటలు ఎదురు చూసే పరిస్థితి మారాలి. సాధ్యమైతే ఒకట్రెండు గంటల్లో దర్శనం జరిగేలా చూడాలని పవన్ కల్యాణ్ అన్నారు.

వేగుచుక్క








# వాహనదారులు విధిగా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలి.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 9 :**

ప్రమాదాల బారిన పడకుండా, ఎంతో విలువైన ప్రాణాలను కాపాడుకునేందుకు వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించకుని జిల్లా పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శిరస్త్రాణం ధరించాల్సిన ఆవశ్యతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన ఈ ర్యాలీని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద జిల్లా జడ్జి, కలెక్టర్ లు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయాలలో విలువైన నిండు ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రతీ యేటా దేశంలో 1.5 లక్షల వరకు ప్రమాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు.







ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతివేగంగా వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు. ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్న వారు నిండు ప్రాణాలను కోల్పోతుండగా, వారి కుటుంబాలకు కూడా తీరని నష్టం కలిగిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, చిన్నచిన్న సరదాలకు పోయి నిర్లక్ష్యంతో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చవద్దని హితవు పలికారు. రోడ్డు దుర్ఘటనలలో అత్యధికంగా ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, ఎంతోమంది క్షతగాత్రులుగా మారుతున్నారని అన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే దాదాపు 90 శాతం వరకు ప్రాణాపాయం బారి

**నిబంధనల ఉల్లంఘనలతో ప్రతి ఏడాది దేశంలో 1.5 లక్షల ప్రమాదాలు.**

**అత్యధికంగా ద్విచక్రవాహనదారులే ప్రాణాలు కోల్పోతున్నారు.**

**అవగాహన ర్యాలీలో జిల్లా జడ్జి, కలెక్టర్.**

**పాల్గొన్న డిటీసి దుర్గాప్రమీల, ఆర్టీఓ ఉమా మహేశ్వర్.**

నుండి తమను తాము కాపాడుకునేందుకు ఆస్కారం ఉంటుందని సూచించారు. ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించడాన్ని అలవాటుగా చేసుకోవాలని, దీనిని కనీస బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఎదుటివారి వల్ల ప్రమాదాలకు గురైన సందర్భాలలోనూ హెల్మెట్ ప్రాణాపాయ స్థితి నుండి కాపాడుతుందని గుర్తు చేశారు. ప్రమాదాల నియంత్రణ కోసం వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ, నిబధనల మేరకు జరిమానాలు విధించడం వంటివి చేస్తున్నప్పటికీ, ఎవరికివారు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించినప్పుడే ప్రమాదాలకు కళ్లెం వేయవచ్చని సూచించారు. హెల్మెట్ల వినియోగం అత్యావశ్యకం, సురక్షితం అనే విషయాన్ని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రమాదాలను నిలువరించేందుకు ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హితవు పలికారు. ఈ సదర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం ధరించాల్సిన అవశ్యకతను తెలియజేస్తూ, పలువురికి మాణిక్ బండార్ పాఠశాల సౌజన్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా హెల్మెట్ లు అందజేశారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వారిని అభినందిస్తూ ముఖ్య అతిథులచే పుష్పగుచ్చాలు బహూకరించారు.

**గాలి పటాల ఎగేరేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి, చైనా మాంజ వాడొద్దు.**

అదేవిధంగా గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రాణాంతకంగా పరిణమిస్తున్న చైనా మాంజాను వినియోగించ కూడదని, దీనిని నిషేధించడం జరిగిందని తెలిపారు. చైనా మాంజా నిషేధం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీలుగా ముద్రించిన గోడ ప్రతులను జిల్లా జడ్జి, కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి పి.పద్మావతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.గోపికృష్ణ, అదనపు జూనియర్ సివిల్ జడ్జీలు ఖుష్బూ ఉపాధ్యాయ్, పి.శ్రీనివాస్ రావు, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమినర్ దుర్గాప్రమీల, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వర్, ఏంవిఐ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

**- మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ. జిల్లా కలెక్టర్ తో భేటీ.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 9**

: మైనారిటీల అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ సూచించారు. గురువారం ఆయన నిజామాబాద్ నగర పర్యటనకు విచ్చేసిన సందర్భంగా అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. స్థానిక రోడ్లు – భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో పాటు ఇతర జిల్లా అధికారులతో భేటీ అయ్యారు. జిల్లాలో మైనారిటీ వర్గాల స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మైనారిటీల కోసం ఉద్దేశించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గరించి అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని చైర్మన్





తారిఖ్ అన్సారీ అధికారులకు సూచించారు. ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద ప్రభుత్వం మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్నందున, అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో మైనారిటీ వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లభించేలా జిల్లా యత్రాంగం తరపున చొరవ చూపాలన్నారు. మైనారిటీలపై దాడులు జరిగిన సందర్భాలలో పోలీస్ అధికారులు సత్వరమే స్పందించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల్కొండ మండలం జలాల్పూర్, వేల్పూరులలో ముస్లిం స్మశాన వాటిక స్థలాలు ఆక్రమణకు గురైనట్లు కమిషన్ దృష్టికి వచ్చిందని, క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే, కమ్మర్పల్లి మండలం నర్సాపూర్ గ్రామంలో చర్చి నిర్మాణానికి నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. నిజామాబాద్ నగర సమీపంలోని సారంగపూర్ వద్ద ఈ నెల 19, 20, 21 తేదీలలో జరిగే ఇజ్తెమాకు నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల నుండి సుమారు 30 వేల పైచిలుకు మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీటి వసతి, శానిటేషన్ వంటి సదుపాయాలు కల్పించా లని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ రెడ్డి కి సూచించారు. అనంతరం మైనారిటీ వర్గాల వారి నుంచి కమిషన్ చైర్మన్ విజ్ఞాపనలు స్వీకరించారు. సమావేశంలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 9:**

రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు అందరం కృషి చేద్దాం అని కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కామారెడ్డిలోని భవిత పాఠశాలలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఐటీ అసోసియేషన్ సెక్రెటరీ చెల్లపురం శ్రీకాంత్‌ను ఏఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తేజ, ఇర్షాద్ అలీ, శంకర్, పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్ రావు పాల్గొన్నారు.



## శరతులు లేకుండా బీడి "జీవనభృతి" ఇవ్వాలి.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 9**

తెలంగాణ రాష్ట్రంలోనీ 10 లక్షల మంది బీడీ కార్మికులకు రూ" 4016 పెంచి ఇవ్వాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) బిఎల్పి రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర,అద్యక్షులు ఎస్. సిద్ధి రాములు డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా జీవన భృతి అందించాలని అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ధర్నా చౌక్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దండి వెంకట్, సిద్దిరాములు మాట్లాడుతూ, 2014లో అప్పటి టీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సమయంలో బాల్కొండ ఎన్నికల సభలో బీడి కార్మికులకు అందరికి పెన్షన్ ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకోని అదికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 3 లక్షల మందికి రూ" 2016 ఇచ్చి, మిగిలిన 7 లక్షల మందికి ఇవ్వకుండా ఎగ్గొట్టిందిని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ" 4016 ఇస్తామని వాగ్దానం చేసింది, కానీ ఏడాది గడుస్తున్న నోరు మెదపడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆంక్షలు లేకుండా జీవన భృతి అందించాలని, రూ" 4016 కు పెంచాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ అన్ని జిల్లాల నుండి వేలాదిమంది బీడీ కార్మికులతో పాదయాత్రలతో ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, రాష్ట్ర నాయకులు ఎం. అజయ్, ఎస్.డి. మహిమూద్, సంఘం నాయకులు, బీడి కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం హామి ఇచ్చిన ప్రకారం రూ"4016 పెంచాలి.**

**లేదంటే హైదరాబాద్ వరకు పాదయాత్ర చేస్తాం.**

**బిఎల్పి రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిద్ధి రాములు.**

